ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 కర్నూలు
జిల్లా వార్తలు
శుక్రవారం 12 ఏప్రిల్ 2024




ప్రార్థనల్లో పాల్గొన్న చిన్నారులు



ఘనంగా రంజాన్

- ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు
- సన్మార్గంలో పయనించండి
- మత పెద్దల పిలుపు




కర్నూలు నగరంలోని పాత ఈద్గా వద్ద రంజాన్ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు





పాత ఈద్గాలో ప్రభుత్వ ఖ్వాజీ సలీంబాషా

కర్నూలు(కల్చరల్), ఏప్రిల్ 11: ముస్లింల అత్యంత ప్రధాన పండుగ 'ఈద్-ఉల్-ఫితర్' (రంజాన్)ను జిల్లా వ్యాప్తంగా గురువారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రం, ప్రధాన పట్టణాలతో పాటు మండల కేంద్రాల్లో కూడా ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చిన్న, పెద్ద తేడా లేకుండా అన్ని వయసుల ముస్లింలు ఉదయం 9 గంటలకల్లా ఈద్గా మైదానాలకు చేరుకుని వజూ, అనంతరం ప్రత్యేక దువా ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా సమాజంలో అందరూ సుఖసంతోషాలతో కలిసిమెలిసి సోదరభావంతో మెలగాలని మతగురువులు హితువు పలికారు. అల్లాహ్ చూపిన సన్మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలని పిలుపునిచ్చారు. రంజాన్ మాసంలో ఆచరించిన ఆధ్యాత్మిక స్ఫూర్తిని ఏడాది పొడవునా ఆచరించాలని, దయాగుణం, శాంతియుత జీవనమే రంజాన్ వేడుక బోధిస్తుందని ముస్లిం మతపెద్దలు ఉద్బోధించారు. ఉపవాసంలో ఎలాగైతే అవినీతి, అసత్యాలకు దూరంగా ఉంటారో అలాంటి జీవితాన్ని దైనందినంగా ఆచరించాలని సూచించారు. రంజాన్ మాసం ముస్లింలకు ఒక ఆధ్యాత్మిక, మానసిక శిక్షణ వంటిదని చెప్పారు. కర్నూలు నగరంలో కొత్తబస్టాండు రోడ్డులోని పాత ఈద్గాలో ప్రభుత్వ ఖ్వాజీ సలీంబాషా, సంతోష్‌నగర్‌లోని కొత్త ఈద్గాలో ముఫ్తీ మన్సూర్, గడ్డావీధిలోని ఈద్గాలో హాఫిజ్ మంజూర్ అహ్మద్ నమాజులు చేయించి, దైవ సందేశాన్ని ప్రబోధించారు. జోహరాపురం ఈద్గాలో హాస్మి జామియా, ఇంపీరియల్ వద్ద అబ్దుల్ అజీజ్ మదానీ, వెంకాయపల్లె ఈద్గా వద్ద హాఫీజ్ ముజమ్మిల్ జామియా నమాజ్‌లు చేయించి, ఆధ్యాత్మిక సందేశం అందజేశారు. పాత ఈద్గాలో జరిగిన ప్రార్థనలకు కర్నూలు అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ హాజరై ముస్లింలకు శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, కర్నూలు అసెంబ్లీ వైసీపీ అభ్యర్థి ఇంతియాజ్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డిలు ముస్లింలకు ఈద్‌ముబారక్ తెలియజేశారు.



ప్రార్థనల్లో పాల్గొన్న కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్



సంతోష్ నగర్ ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు



అవ్వాతాతలకు అన్యాయం

- గత టీడీపీ పాలనలో కొత్తగా ఇచ్చిన పింఛన్లు 1.18 లక్షలు
- జగన్ కొత్తగా ఇచ్చినవి 30 వేలలోపే
- వివిధ కారణాలతో 35 వేల పింఛన్లకు కోత
- తానొక్కడే వృద్ధులను ఉద్ధరిస్తున్నట్లు జగన్ కలరింగ్
- టీడీపీ అధికారంలోకి రాగానే రూ.4 వేలకు పింఛన్ పెంపు

అవ్వా తాతలపై సీఎం జగన్ చూపిస్తున్నది కపట ప్రేమ అని తేలిపోయింది. ఎన్నికల నేపథ్యంలో రాజకీయ లబ్ధి కోసం ఉద్దేశపూర్వకంగానే పింఛన్ల పంపిణీలో జాప్యం చేశారు. అవ్వా తాతలకు ఇండ్ల వద్దకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేయకపోవడానికి టీడీపీనే కారణం అంటూ బురదజల్లే ప్రయత్నం చేశారు. చివరికి అభాసుపాలయ్యారు. టీడీపీ ప్రభుత్వంలో వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు 1.18 లక్షల మందికి పైగా కొత్త వారికి పింఛన్లు ఇచ్చారు. రూ.200 నుంచి రూ.2 వేల దాకా పెంచారు. వైసీపీ ప్రభుత్వంలో 30 వేల మందికి కూడా ఇవ్వలేదు. వివిధ కారణాలతో 35 వేలు మందికి కోత పెట్టారు. ఇదీ అవ్వా తాతలపై జగన్ కపట ప్రేమ.

కర్నూలు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి):

రాష్ట్రంలో విభజన తరువాత ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2014 జూన్ నాటికి 2.75 లక్షలు వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, చేనేత, కల్లుగీత కార్మికులు, అభయ హస్తం.. ఇలా వివిధ కేటగిరీల కింద 2.75 లక్షల మందికి సామాజిక భద్రత పింఛన్లు ఉన్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో గతంలో రూ.200 పింఛన్ ఇస్తే.. చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక ఎన్టీఆర్ భరోసా పింఛన్లుగా పేరు మార్చి రూ.వెయ్యి ఇవ్వడం మొదలు పెట్టారు. అర్హత కలిగి దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ పింఛను మంజూరు చేశారు. 2016 మే నాటికి 3.09 పింఛన్లు లక్షలకు చేరాయి. కేవలం రెండేళ్లలోనే 35 వేలకు పైగా కొత్తగా పింఛన్లు మంజూరు చేశారు. 2019 జనవరిలో నాటి టీడీపీ ప్రభుత్వం రూ.2 వేలకు పెంచింది. జనవరిలో పెంచిన రూ.వెయ్యి కలిపి ఫిబ్రవరిలో రూ.3 వేలు పింఛన్ ఇచ్చారు. ఆ సమయంలో ఉమ్మడి జిల్లాలో 3.93 లక్షలు మంది పింఛన్లు లబ్ధిదారులు ఉన్నారు. అంటే.. 2014 జూన్ నుంచి 2019 ఫిబ్రవరి వరకు ఐదేళ్ల టీడీపీ ప్రభుత్వం 1.18 లక్షలు కొత్తగా అవ్వాతాతలు, ఒంటిరి మహిళలు, దివ్యాంగులకు పింఛన్లు మంజూరు చేసినట్లు అధికారిక రికార్డులు ద్వారా స్పష్టంగా తెలుస్తుంది. నాటి చంద్రబాబు ప్రభుత్వ హయాంలోనే అవ్వాతాతలకు ఎంతో మేలు జరిగిందని చెప్పవచ్చు.



ఐదేళ్లలో రూ.200 నుంచి రూ.2,000కు పెంపు

రాష్ట్ర విభజన తరువాత 2014 జూన్ నెలలో వృద్ధులకు ఇస్తున్న పింఛన్ రూ.200. చంద్రబాబు ప్రభుత్వం దీన్ని రూ.1,000కు పెంచారు. 2019 జనవరిలో రూ.2 వేలు చేశారు. తనకు అధికారం ఇస్తే రూ.3 వేలు చేస్తానని జగన్ ప్రతిపక్ష నేతగా హామీ ఇచ్చారు. అధికారం చేపట్టాక విడతల వారి డ్రామాకు తెర తీసి ఏడాదికి రూ.250 పెంచుకుంటూ పోయారు. ఇట్లా ఈ ఐదేళ్లలో పెంచింది కేవలం రూ.వెయ్యి మాత్రమే.

జగన్ వచ్చాక 35 వేల పింఛన్లు కోత

2019 మే 30న జగన్ సీఎంగా బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం కర్నూలు జిల్లాలో జిల్లాలో 2.45 లక్షలు, నంద్యాల జిల్లాలో 2.24 లక్షలు కలిపి ఉమ్మడి జిల్లాలో 4.69 లక్షల పింఛన్లు ఉన్నాయి. టీడీపీ హయాంలో ఉన్న పింఛన్లతో పోలిస్తే.. జగన్ ప్రభుత్వం ఐదేళ్లలో కొత్తగా ఇచ్చిన పింఛన్లు 76 వేలకు మించలేదు. అంతేకాదు.. ఇంట్లో ఒకరికే పింఛను ఇచ్చారు. పది ఎకరాలు పొలం, నాలుగు చక్రాల వాహనం ఉన్నా, ఇంట్లో ఎవరైనా ఆదాయ పన్ను చెల్లిస్తున్నా, 300 యూనిట్లకు పైగా కరెంట్ బిల్లు కడుతున్నా.. పింఛన్‌కు కొర్రీ పెట్టి పెట్టి దాదాపుగా 35 వేల మందిని తొలగించారు. వారి స్థానంలో కొత్త వారికి ఇచ్చారు. ఈ లెక్కన చూస్తే జగన్ ప్రభుత్వంలో ఐదేళ్లలో కొత్తగా ఇచ్చిన పింఛన్లు 30 వేలకు మించలేదని తెలుస్తోంది. వాస్తవాలు ఇలా ఉంటే.. ఎన్నికల్లో ఓట్ల కోసం అవ్వాతాతలకు తామేదో చేశామని వైసీపీ గొప్పలు చెప్పుకుంటోంది.

2019 ఫిబ్రవరి నాటికి ఉమ్మడి జిల్లాలో ఉన్న ఎన్టీఆర్ భరోసా పింఛన్లు

కేటగిరీ	పింఛన్‌దారులు
వృద్ధాప్య పింఛన్	1,62,497
వితంతువులు	1,63,764
వికలాంగులు	47,777
చేనేత కార్మికులు	4,621
కల్లుగీత కార్మికులు	344
అభయ హస్తం	3,589
ఒంటరి మహిళ	4,993
మత్స్యకారులు	1,320
ట్రాన్స్‌జండర్	318
డప్పు కళాకారులు	2,352
డయాలసిస్	123
ట్రడిషనల్ కాబ్లర్స్	1,272
మొత్తం	**3,92,968**



● అవ్వాతాతలకు చంద్రన్న వరం:

టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం జూన్‌లో కొలువుదీరనుంది.. వృద్ధులకు పింఛన్ రూ.4 వేలకు పెంచుతాం.. అని టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు ఇప్పటికే హామీ ఇచ్చారు. ఉమ్మడి మేనిఫెస్టోలో కూడా పెట్టారు. ఈ ఏప్రిల్ నెల నుంచి పెంపు వర్తింప చేస్తామని, జూలై పింఛన్ రూ.4 వేలుతో పాటు ఏప్రిల్, మే, జూన్ నెలలకు రూ.వెయ్యి చొప్పున రూ.3 వేలు అదనంగా కలిపి రూ.7 వేలు జూలై ఒకటో తారీఖున ఇంటి వద్దకే వెళ్లి అందజేస్తామని ప్రకటించారు. ఓట్లాటలో టీడీపీపై బురదజల్లి రాజకీయ లబ్ధి పొందాలని జగన్ ఎత్తులు వేస్తే.. జూన్‌లో ఏర్పాటు కానున్న ఎన్డీఏ ప్రభుత్వం ఏప్రిల్ నుంచే పెంచిన రూ.4 వేలు పింఛను అమలు చేస్తుందని చంద్రబాబు ప్రకటించారు.



నేడు ఇంటర్ ఫలితాలు విడుదల

కర్నూలు(ఎడ్యుకేషన్), ఏప్రిల్ 11: ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్ష ఫలితాలను శుక్రవారం ఉదయం 11 గంటలకు విడుదల కానున్నాయి. తాడేపల్లిలోని ఇంటర్ బోర్డు కార్యాలయంలో ఇంటర్ బోర్డు కార్యదర్శి ఫలితాలు విడుదల చేస్తున్నట్లు ఆర్ఐవో ఎస్‌వీఎస్ గురువయ్యశెట్టి తెలిపారు. ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరం జనరల్ కోర్సుతో పాటు ఒకేషనల్ కోర్సు ఫలితాలు విడుదల అవుతాయన్నారు. మార్చి ఒకటో తేదీ నుంచి 18వ తేదీ వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు కొనసాగాయి. కర్నూలు జిల్లాలో మొత్తం ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు 22,239 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 25,173 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరయ్యారు. ఏప్రిల్ 4వ తేదీ వరకు కర్నూలు ప్రభుత్వ టౌన్‌మోడల్ కళాశాలలో ఇంటర్ జవాబు పత్రాల మూల్యాంకనం కొనసాగింది. ఇంటర్మీఇయట్ పరీక్షల ఫలితాలు విడుదల కానుండటంతో ఇటు విద్యార్థులకు, తల్లిదండ్రుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

పూలే అందరికీ ఆదర్శం: కలెక్టర్



జ్యోతిరావు పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్

కర్నూలు(కలెక్టరేట్), ఏప్రిల్ 11: బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి, స్త్రీల విముక్తికి పాటుపడిన మహాత్మా జ్యోతిరావు పూలే అందరికీ ఆదర్శప్రాయుడని కలెక్టర్ డా.జి. సృజన పేర్కొన్నారు. గురువారం మహాత్మా జ్యోతిరావు పూలే 198వ జయంతి సందర్భంగా జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నగరంలోని శరీన్‌నగర్‌లోని మహాత్మా జ్యోతిరావు పూలే, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్థిక, సామాజిక సమానత్వం కోసం, చైతన్యవంతమైన జీవితం కోసం చదువు అవసరం అని మహాత్మా పూలే ఆనాడే చెప్పారన్నారు. విద్య ద్వారానే కుల, లింగ వివక్షతకు తావు లేకుండా సమానత్వం సాధ్యమని అన్నారు. ఆయన తన సహచరి సావిత్రీ బాయికి గురువుగా మారి, మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా తీర్చిదిద్దారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి వెంకట లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

నాటు సారా, అక్రమ మద్యంపై ఉక్కుపాదం

- పాత నేరస్థులపై బైండోవర్ కేసులు పెట్టండి
- సెబ్ అసిస్టెంట్ కమిషనర్ సుధాకర్‌రెడ్డి



పంచలింగాల చెక్ పోస్టుల్లో తనిఖీ చేస్తున్న అసిస్టెంట్ కమిషనర్

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 11: నాటు సారా, అక్రమ మద్యంపై ఉక్కుపాదం మోపుతామని స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో అసిస్టెంట్ కమిషనర్ ఎం. సుధాకర్‌రెడ్డి ఆదేశించారు. గురువారం జిల్లాలో ఆయన విస్తృతంగా పర్యటించి, పంచలింగాల, సుంకేశుల చెక్ పోస్టులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం, నాటు సారా, అనధికార మద్యం అమ్మకం కేంద్రాలపై దాడులు విస్తృతం చేయాలని ఆదేశించారు. పాత నేరస్తులందరినీ ముందస్తుగా బైండోవర్ చేయాలని ఆదేశించారు. మద్యం డంపింగ్‌లపై దృష్టి సారించి, పాత నేరస్తులపై నిఘా ఉంచాలని తెలిపారు. ప్రధాన కింగ్ పిన్‌లను గుర్తించి వారిపై పీడీ యాక్ట్, జిల్లా బహిష్కరణ చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో ఇన్‌స్పెక్టర్ కేఈఆర్ రాజేంద్ర ప్రసాద్, డీటీఎఫ్ సీఐ ఈ. నరసానాయుడు, సుంకేశుల చెక్ పోస్టు సీఐ మల్లిక, పంచలింగాల చెక్ పోస్టు సీఐ రాజశేఖర్ పాల్గొన్నారు.

ఉగాది ఉత్సవాల్లో అపశ్రుతి

- చిన్నటేకూరులో ప్రభకు తగిలిన విద్యుత్ వైర్లు
- 13 మంది చిన్నారులకు విద్యుదాఘాతం
- తప్పిన పెను ప్రమాదం



ఆంజనేయస్వామి ప్రభ

కర్నూలు/కల్లూరు, ఏప్రిల్ 11: కల్లూరు మండలంలో గురువారం జరిగిన ఉగాది ఉత్సవాల్లో అపశ్రుతి చోటు చేసుకుంది. చిన్నటేకూరు గ్రామంలో ప్రభకు విద్యుత్ వైర్లు తగిలి అందులో కూర్చున్న 13 మంది చిన్నారులు గాయాలపాలయ్యారు. చిన్నటేకూరు గ్రామంలో ఉగాది పండుగ సందర్భంగా మూడు రోజులుగా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. గ్రామంలో ఉన్న ఆంజనేయస్వామి దేవాలయ ప్రభలను గ్రామమంతా ఊరేగించారు. బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం ఉదయం వరకు ఈ కార్యక్రమం కొనసాగింది. ఆంజనేయస్వామి ప్రభలను లాగిన గ్రామ పెద్దలంతా తెల్లవారుజాము కావడంతో ఇంటికి వెళ్లిపోగా.. అక్కడున్న కొంత మంది ప్రభను ముందుకు లాగారు. ఈ సమయంలో సుమారు 15 మంది చిన్నారులు (15ఏళ్లలోపు వారే) ఉత్సాహంగా ప్రభల్లో కూర్చున్నారు. ప్రభ లాగుతుండగా రోడ్డుపై ఉన్న స్పీడ్ బ్రేకర్ పైకి ఎక్కే క్రమంలో పైన ఉన్న విద్యుత్ తీగలు ప్రభను తాకాయి. ఒక్కసారిగా విద్యుత్ ప్రవహించడంతో ప్రభలో కూర్చున్న చిన్నారులందరూ విద్యుదాఘాతానికి గురయ్యారు. వారికి గాయాలయ్యాయి. కొంత మంది చిన్నారులు అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారు. ప్రభ వెంటనే కొంచెం ముందుకు వెళ్లడంతో విద్యుదాఘాతం నుంచి విడిపోయింది. ఈ సంఘటన నుంచి తేరుకున్న స్థానికులు అప్రమత్తమై చిన్నారులను అంబులెన్సులో చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రి వైద్యులు వెంటనే వారికి ప్రథమ చికిత్స అందించడంతో చిన్నారులంతా స్వల్ప గాయాలతో కోలుకున్నారు. ఇద్దరు చిన్నారులకు మెరుగైన వైద్యం అందిస్తున్నారు. గాయపడిన వారిలో చిన్నారులు ప్రవీణ్ (12), గౌతమ్ (9), మానిష్ (10), అఖిలేష్ (10), పవన్ (9), ఉమామహేష్ (10), మల్లికార్జున (10), సాత్విక్ (9), మల్లికార్జున (10), వరుణ్ (13), వెంకటేశ్ (11), జశ్వంత్ (13), అజయ్ (12) ఉన్నారు. ప్రస్తుతం చిన్నారులు పీడీయాట్రిక్ వార్డులో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనతో గ్రామస్థులంతా ఆందోళనకు గురయ్యారు. ఉత్సవాల్లో భాగంగా విద్యుత్ తీగలకు కరెంటు తీసేశామని చెప్పినా కరెంటు ఎలా సరఫరా అయిందో తెలియడం లేదని గ్రామస్థులు పేర్కొన్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులను నంద్యాల టీడీపీ అభ్యర్థి బైరెడ్డి శబరి పరామర్శించారు. చిన్నారులకు అందుతున్న వైద్యసేవల గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ఆరోపించారు. అదేవిధంగా పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి కూడా గాయపడిన చిన్నారులను పరామర్శించారు. ఉలిందకొండ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఘటనపై ఆరా తీశారు. గ్రామస్థుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.



గాయపడిన చిన్నారులు

విద్యుత్‌శాఖ తప్పిదం లేదు...
- యం. ఉమాపతి, ఎస్ఈ

చిన్నటేకూరు విద్యుత్ ప్రమాద ఘటనలో విద్యుత్‌శాఖ తప్పిదం లేదని కర్నూలు ఆపరేషన్ ఎస్ఈ యం. ఉమాపతి తెలిపారు. ఈమేరకు ఆయనతో పాటు కర్నూలు డివిజన్ ఈఈ వెంకటేశ్వర్లు గ్రామంలో పర్యటించి ఘటనపై ఆరా తీశారు. చిన్నటేకూరు గ్రామ ఎనర్జీ అసిస్టెంట్ ముందస్తు చర్యగా 11 కేవీ విద్యుత్‌సప్లై ఆఫ్ చేశారన్నారు. ఉగాది ఉత్సవాల్లో భాగంగా ఆంజనేయస్వామి ప్రభను ఊరేగించిన గ్రామస్తులు ప్రభ అలంకరణకు 3 కేవీ జనరేటర్‌ను అమర్చారని అన్నారు. ఉదయం 7.05 నిమిషాలకు ప్రభపై మంటలు వచ్చి 13 మంది పిల్లలు విద్యుదాఘాతానికి గురయ్యారని తెలిపారు. చిన్నటేకూరు గ్రామానికి సరఫరా చేసే లైన్లలో విద్యుత్ ప్రవాహం జరగలేదని నిర్ధారించామని అన్నారు. ఇందులో విద్యుత్‌శాఖ తప్పిదం లేదన్నారు.



కర్నూలు పెద్దాసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులు



చిన్నటేకూరు ప్రమాద ఘటన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎస్ఈ యం. ఉమాపతి

ద్విచక్ర వాహనం ఢీకొని మహిళ మృతి

తుగ్గలి, ఏప్రిల్ 11: ద్విచక్రవాహనం ఢీకొని లాలెమ్మ (46) అనే మహిళ వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటన బుధవారం జరిగింది. ఉప్పర్లపల్లె గ్రామ శివారులో రోడ్డు పక్కన పడి వున్న చెత్త చెదారంలోని గుజిరి సామాన్లు పోగు చేసుకుంటున్న మహిళ లాలెమ్మను ద్విచక్రవాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన లాలమ్మను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ కోలుకోలేక గురువారం మృతి చెందింది. మృతురాలి భర్త ఆదినారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు జొన్నగిరి ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. లాలమ్మది అనంతపురం జిల్లా పెద్దపప్పూరు మండలం అంబులదిన్నె గ్రామం.

రెండు బైకులు ఢీకొన్న ఘటనలో..

నందవరం, ఏప్రిల్ 11: మండల పరిధిలోని కనకవీడు, పూలచింత గ్రామాల మధ్యలో రెండు బైకులు ఢీకొన్న ప్రమాదంలో కుమ్మరి రాముడు(30) అనే వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన గురువారం జరిగింది. రాముడు బంధువు ఒకరు మరణించడంతో అంత్యక్రియలకు వెళ్లి బైక్ మీద తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో పూలచింత క్రాస్ దగ్గర మరో మోటర్ బైక్ అతి వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన రాముడిని 108లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడని, కేసు నమోదు చేసుకున్నామని పోలీసులు తెలిపారు.

వడదెబ్బతో రైతు...

ఆత్మకూరు రూరల్, ఏప్రిల్ 11: ఆత్మకూరు మండలం కరివేన గ్రామానికి చెందిన బొట్టా మద్దిలేటి (45) అనే రైతు వ్యవసాయ పొలంలో పనులు చేసుకుంటూ వడదెబ్బ సోకి మృతి చెందాడు. ఈ సంఘటన గురువారం జరిగింది. మండలంలోని కరివేన గ్రామానికి చెందిన మద్దిలేటి వేసవి దుక్కుల కోసం తన పొలంలో గట్లను ఏర్పాటు చేసుకొనే పనుల్లో ఉండగా ఎండ తీవ్రతకు అక్కడి కక్కడే కుప్పకూలి పోయాడు. స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు ఆటోలో ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యంలోనే మద్దిలేటి మృతి చెందాడు. మృతునికి భార్యతో పాటు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. మద్దిలేటి కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

వాగులో మునిగి బాలుడి మృతి

పాణ్యం, ఏప్రిల్ 11 : రంజాన్ పర్వదినాన ఆనందంగా గడపాల్సిన ఆ కుటుంబంలో విషాదం నిండింది. పాణ్యం మండలంలోని కౌలూరు గ్రామానికి చెందిన దూదేకుల ఉశేన్‌బాష కుమారుడు అహ్మద్ షమీర్ (13) కానుగల వాగులో మునిగి మృతి చెందాడు. ఈ ఘటన గురువారం జరిగింది. షమీర్ చిన్నాన్న మహ్మద్ హుశేన్‌తో మోటారుసైకిల్ కడుక్కోవడానికి గ్రామానికి సమీపంలోని కానుగల వాగుకు వెళుతుండగా షమీర్ కూడా వెళ్లాడు. మహ్మద్ హుశేన్ మోటారుసైకిల్ కడుక్కుంటుండగా షమీర్ ఈతకొడుతూ వాగు ప్రవాహ ఉధృతికి నీటిలో మునిగిపోయాడు. కొనఊపిరితో ఉన్న షమీర్‌ను శాంతిరాం ఆసుపత్రికి తరలించారు. అక్కడ కోలుకోలేక మృతి చెందాడని ఎస్ఐ అశోక్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

మళ్లీ కొండముచ్చు దాడి

- ఆరుగురికి గాయాలు
- భయాందోళనలో ప్రజలు



కొండముచ్చు దాడిలో తీవ్రగాయాలైన దృశ్యం

డోన్(రూరల్), ఏప్రిల్ 11: పట్టణంలో కొండముచ్చు మరోసారి ప్రజలపై దాడి చేసింది. గురువారం కొండముచ్చుల గుంపు పట్టణంలోని పలు కాలనీల మీద పడి పలువురిపై దాడి చేసింది. ఈ దాడిలో ఆరుగురు గాయపడ్డారు. వీరు డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి వైద్య చికిత్స కోసం వచ్చారు. గత నాలుగు రోజుల నుంచి వరుసగా కొండముచ్చు పట్టణంలో హల్‌చల్ చేస్తూ వ్యక్తులపై దాడి చేసి తీవ్రంగా గాయపరుస్తూనే ఉన్నాయి. కొండముచ్చులను పట్టుకోవడానికి అటవీ అధికారులు ప్రయత్నాలు చేస్తున్నా ఫలించడం లేదు. దీంతో పట్టణ ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి. కొండముచ్చు దాడిలో గాయపడి ఆసుపత్రుల పాలైన కేసులు 30 దాకా వచ్చాయని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. కొండముచ్చులను అటవీ అధికారులు పట్టుకోకపోతే బాధితుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

బుజ్జమ్మ దంపతులకు గన్‌మెన్ల తొలగింపు

- టీడీపీలో చేరడమే కారణమా...?



గన్‌మెన్‌తో కప్పట్రాళ్ల బుజ్జమ్మ దంపతులు (ఫైల్)

ఆలూరు, ఏప్రిల్ 11: టీడీపీ నాయకురాలు కపట్రాల బుజ్జమ్మ, రామచంద్రనాయుడు దంపతులకు ఫ్యాక్షన్ నేపథ్యంలో సీఎం జగన్ ప్రత్యేకంగా వారి భద్రతకు గన్‌మెన్లను ఏర్పాటు చేశారు. ఇటీవల బుజ్జమ్మ దంపతులు వైసీపీను వీడి టీడీపీలో చేరడంతో బుధవారం రాత్రి వారి గన్‌మెన్లను తొలగించారు. ఎన్నికల వేళ ఫ్యాక్షన్ నేపథ్యం ఉన్న తమకు సీఎం జగన్ కావాలనే భద్రత లేకుండా చేశారని వారు ఆరోపిస్తున్నారు.

గన్‌మెన్ల తొలగింపుపై సందేహాలు...

వైసీపీలో ఉన్న కపట్రాల బుజ్జమ్మకు 2+1 రామచంద్ర నాయుడుకు 1+1 చొప్పున గన్‌మెన్లను ఏర్పాటు చేశారు. పార్టీ మారడం వల్లే వారికి ప్రభుత్వం వారికి గన్‌మెన్లను తొలగించినట్లు ఫ్యాక్షన్ గ్రామాల్లో ఉంటున్న కపట్రాళ్ళ బుజమ్మ వర్గీయులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం ఇంటిలిజెన్స్ వర్గాల ద్వారా నివేదికను తెప్పించి టీడీపీ నేత బుజ్జమ్మ కుటుంబానికి రక్షణ కల్పించాలని వారు కోరుతున్నారు.

బ్రాహ్మణుడిపై వైసీపీ నాయకుడి దాడి

- వైసీపీ అభ్యర్థి ఇంతియాజ్ ప్రచారంలో ఘటన
- ఖండించిన బ్రహ్మణ సంఘాల నేతలు

కర్నూలు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరంలో బ్రాహ్మణ సామాజికవర్గానికి చెందిన 51 వార్డు వైసీపీ ఇన్‌చార్జి కృష్ణకాంత్ శర్మపై అదే వార్డుకు చెందిన వైసీపీ నాయకుడు రాఘవేంద్రనాయుడు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఏపీ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య అధ్యక్షుడు వెంకటరామరాజు పేర్కొన్నారు. గురువారం కర్నూలు జిల్లా బ్రహ్మణ సంఘాల జేఏసీ కన్వీనర్ దేవిప్రసాద్, ఏపీబీఎస్ఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ రావు, బ్రాహ్మణ సేవా సంక్షేమ మిత్రమండలి అధ్యక్షుడు చంద్రశేఖర్, ఏపీబీఎం అధ్యక్షుడు సాయినాథ్‌శర్మ, పరశురామ్ పరివార్ అధ్యక్షుడు ఆనంద్ రావు, సుబ్రహ్మణ్యప్రసాద్‌లతో కలసి బాధితులు కృష్ణకాంత్ శర్మ కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం బాధితుడితో కలసి విలేకరులతో మాట్లాడారు. బుధవారం వైసీపీ అభ్యర్థి ఇంతియాజ్ అహ్మద్ షరాఫ్‌బజారులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఇదే కార్యక్రమంలో 51వ వార్డు కన్వీనరు హోదాలో బాధితుడు కృష్ణకాంత్‌శర్మ కూడా పాల్గొన్నారు. ఆ సమయంలో వైసీపీ అభ్యర్థి సమక్షంలోనే అకారణంగా మరో వైసీపీ నాయకుడు రాఘవేంద్ర నాయుడు తనపై దాడి చేశాడని, 'ఎందుకు కొడుతున్నావు..' అని అడిగినా పట్టించుకోకుండా విచక్షణ కోల్పోయి తనపై దాడి చేశాడని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. ఏపీ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య అధ్యక్షుడు వెంకటరామరాజు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో 200 మంది బ్రాహ్మణులపై దాడులు జరిగాయన్నారు. బాధితుడు కృష్ణకాంత్‌శర్మకు తక్షణమే వైసీపీ నాయకుడు క్షమాపణ చెప్పాలన్నారు. లేనిపక్షంలో త్వరలో కార్యాచరణ రూపొందించి బాధితులకు అండగా ఆందోళనలు చేయాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఏపీ బ్రాహ్మణ సంఘం మహిళా విభాగం అధ్యక్షురాలు మారుతీశర్మ మాట్లాడుతూ పురోహితులు, అర్చకులపై రోజురోజుకూ దాడులు పెరుగుతున్నాయని అన్నారు. దాడిని ప్రతి ఒక్క బ్రాహ్మణుడు ఖండించాలని కోరారు. పార్టీలకు అతీతంగా బ్రాహ్మణులపై జరుగుతున్న దాడులను అడ్డుకునేందుకు ముందుంటున్నామని అన్నారు.



మాట్లాడుతున్న బ్రాహ్మణ సంఘం నాయకులు

టీడీపీ కూటమి గెలిస్తేనే అభివృద్ధి: గౌరు చరిత



36వ వార్డు రిచ్‌మండ్‌విల్లాస్‌లో శంఖారావం సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తున్న గౌరు చరిత

కల్లూరు, ఏప్రిల్ 11: టీడీపీ కూటమిలోని చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమం సాధ్యమని పాణ్యం టీడీపీ అభ్యర్థి మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత స్పష్టం చేశారు. గురువారం కల్లూరు అర్బన్ 36వ వార్డు రిచ్‌మండ్‌విల్లాస్‌లో ఆమె శంఖారావం, టీడీపీ సూపర్‌సిక్స్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటికీ తిరిగి మ్యానిఫెస్టో పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గౌరు చరిత మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరి భవిష్యత్తు కోసం టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జ్ రెడ్డిగారి తిరుమలేశ్వరరెడ్డి, పియూ.మాదన్న, పెద్దబీచుపల్లి, ధనుంజయ, చిన్నబీచుపల్లి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సైకో జగన్‌ను సాగనంపుదాం

కర్నూలు టీడీపీ ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు



మాట్లాడుతున్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు నాగరాజు, రాఘవేంద్రరెడ్డి

మంత్రాలయం, ఏప్రిల్ 11 : ఒక్క చాన్స్ అంటూ అధికారంలోకి వచ్చి బీసీలకు అన్యాయం చేసిన సైకో జగన్‌ను గద్దె దింపేందుకు సిద్ధం కావాలని కర్నూలు పార్లమెంటు టీడీపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు పిలుపునిచ్చారు. గురువారం మంత్రాలయం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్రరెడ్డితో కలసి ఆయన వాల్మీకి, కురువ సామాజిక వర్గాలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ వాల్మీకి, కురువ సామాజిక వర్గాలకు చెందిన అభ్యర్థులను చంద్రబాబు నాయుడు టికెట్లు కేటాయించారని, ఆయన రుణం తీర్చుకోలేనిదన్నారు. బడుగు, బలహీనవర్గాలకు చెందిన ప్రతి ఒక్కరూ త్వరలో జరగబోయే ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులను గెలిపించి చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకుందామన్నారు. ఒక్క చాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ రెడ్డి దళితులకు, బీసీలకు అన్యాయం చేసి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశాడని ఆరోపించారు. బీసీల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమవుతుందన్నారు. రాజధాని లేని రాష్ట్రంగా ఏపీని భ్రష్టు పట్టించిన ఘనత జగన్‌కు దక్కుతుందన్నారు. ఈ సమావేశంలో టీడీపీ సీనియర్ నాయకులు పల్లెపాడు ముత్తురెడ్డి, రామారెడ్డి, రఘునాథరెడ్డి, రామక్రిష్టారెడ్డి, రాకేష్ రెడ్డి, రాజారెడ్డి, రామకృష్ణ, మాలపల్లి లక్ష్మయ్య, జ్ఞానేష్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలను శాసిస్తున్న డబ్బు

- 800 చిత్రాల్లో నటించా..
- సినీ జీవితంలో ఎన్నో ఆటుపోట్లు
- పిఠాపురం నుంచి పవన్‌కళ్యాణ్ గెలుపు తథ్యం
- ప్రముఖ సినీ నటుడు సుమన్



మంత్రాలయం, ఏప్రిల్ 11: ప్రస్తుత రాజకీయాలన్నీ డబ్బుతో కూడుకున్నాయని, గెలుపోటములను డబ్బు శాసిస్తోందని ప్రముఖ సినీ నటుడు సుమన్ అభిప్రాయపడ్డారు. గురువారం రాఘవేంద్రస్వామి దర్శనార్థం వచ్చిన ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. సినీ పరిశ్రమలో పది భాషల్లో దాదాపు 800 చిత్రాల్లో నటించానని ప్రముఖ సినీ నటుడు సుమన్ అన్నారు. తెలుగులో హీరోగా వంద చిత్రాలు, తమిళలో 50 చిత్రాలు, కన్నడ 25 చిత్రాల్లో నటించానని ఆయన తెలిపారు. రాజకీయాల్లో డబ్బే ప్రధానమని, డబ్బు ఎక్కడ ఉంటే.. అక్కడ గెలుపు ఓటములు తారుమారయ్యే అవకాశం ఉందని తెలిపారు. అయినా కొన్ని చోట్ల మాత్రం అభ్యర్థుల స్టార్ ఇమేజ్ పనిచేస్తుందన్నారు. జనసేన పార్టీ అధ్యక్షుడు, హీరో పవన్‌కళ్యాణ్ పిఠాపురం నుంచి గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఎమ్మిగనూరులో మూడురోజులు ఎంఈవో సునంద నిర్మాతగా, ప్రసాద్ డైరెక్టరుగా 'చట్టమా.. శాసనమా' అనే చిత్ర షూటింగ్ జరుగుతోందన్నారు. అందులో పాల్గొనేందుకు వచ్చినట్లు తెలిపారు. తండ్రీ కూతుళ్ల మధ్య ఉండాల్సిన అనుబంధం, కుటుంబ నేపథ్యం, సంప్రదాయం, సంస్కృతి వంటి సందేశాలతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు తెలిపారు. మంత్రాలయానికి మూడుసార్లు వచ్చానని, ఈ నెల 23న మంత్రాలయం, మైదుకూరులోని బ్రహ్మంగారి మఠాన్ని దర్శించుకునేందుకు సన్నాహాలు చేసుకున్నానని, అదేవిధంగా ఎమ్మిగనూరులో మూడు రోజుల షూటింగ్ ప్లాన్ చేయడంతో రాఘవేంద్రస్వామిని, పీఠాధిపతిని దర్శించుకోవడంతో తన జీవితం ధన్యమైందని అన్నారు. 46 ఏళ్ల సినీ జీవితంలో ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొనాల్సి వచ్చిందని, తాను నమ్ముకున్న నటనే తనను ఇంతటివాడ్ని చేసిందన్నారు. సిని పరిశ్రమంలో తనకంటూ గాడ్‌ఫాదర్ ఎవరూలేరని సుమన్ తెలిపారు. 800 చిత్రాల్లో శ్రీరామదాసు, అన్నమయ్య, పరువుప్రతిష్ఠ, బావబామ్మర్ది తదితర చిత్రాల్లో తనకు వందలాది పురస్కారాలు, అవార్డులు దక్కాయన్నారు.



సుమన్‌కు మెమెంటో ఇస్తున్న పీఠాధిపతి









భక్తి శ్రద్ధలతో

రంజాన్





రంజాన్ వేడుకను ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లోని ఈద్గాల వద్ద ప్రత్యేక ఈద్ నమాజులు నిర్వహించారు. ఈద్గాల వద్ద ముస్లిం మతపెద్దలు ప్రార్థనలు చేయించి, దైవ సందేశం అందించారు. రంజాన్ మాసం 30 రోజుల్లో ఉపవాసం దీక్షల ద్వారా ఎలాంటి పరివర్తన చెందారో అలాగే ఏడాది పొడవునా కొనసాగించాలని ఉద్బోధించారు. ఈ మాసంలో చేసిన ఉపవాసాలు, దానధర్మాలు, పుణ్యకార్యాల వల్ల కలిగిన మానసిక సంతృప్తితోపాటు సంఘజీవులుగా కలిసిమెలిసి జీవించాలని అన్నారు. రంజాన్‌లో దానాలు ఇవ్వడం అనేది గొప్ప కార్యమని చెప్పారు.

- ఈద్గాల వద్ద ముస్లిం ప్రార్థనలు
- ప్రవక్త బోధనలు వినిపించిన మతపెద్దలు









కర్నూలు(కల్చరల్), ఏప్రిల్ 11: రంజాన్ వేడుకను ముస్లింలు కర్నూలులో భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. కర్నూలు నగరంలో కొత్తబస్టాండు రోడ్డులోని పాత ఈద్గాలో ప్రభుత్వ ఖ్వాజీ సలీంబాషా, సంతోష్‌నగర్‌లోని కొత్త ఈద్గాలో ముఫ్తీ మన్సూర్ ఖ్వాస్మీ, గడ్డా వీధిలోని ఈద్గాలో హాఫిజ్ మంజూర్ అహ్మద్ నమాజులు చేయించి, దైవ సందేశాన్ని ప్రబోధించారు. జోహరాపురం ఈద్గాలో హాస్మి జామియా, ఇంపీరియల్ వద్ద అబ్దుల్ అజీజ్ మదానీ, వెంకాయపల్లె ఈద్గా వద్ద హాఫిజ్ ముజమ్మిల్ జామియా నమాజ్‌లు చేయించి, ఆధ్యాత్మిక సందేశం అందజేశారు.

ఓర్వకల్లు : మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం రంజాన్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. హుశేనాపురం ఈద్గాలో నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఎస్‌ఐ రాజారెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

సి. బెళగల్: మండల కేంద్రంతోపాటు గొల్లలదొడ్డి, మారందొడ్డి, కొత్తకోట, పోలకల్లు, సంగాల, తిమ్మనదొడ్డి, బ్రబాహ్మణదొడ్డి గ్రామాలలో రంజాన్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో దూద్‌వలి, ఖాదర్, యస్‌ఎంబాష పాల్గొన్నారు.

కోడుమూరు రూరల్ : మండలంలోని గ్రామాలలో రంజాన్ పర్వదిన వేడుకలను ముస్లింలు ఘనంగా నిర్వహించుకున్నారు. వేడుకల్ని పురస్కరించుకుని చిన్నా, పెద్ద కలిసి ఈద్గాలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్యాలకుర్తి, చిల్లబండ, క్రిష్టాపురం, గోరంట్ల, అమడగుంట్ల, అనుగొండ, లద్దగిరి, పులకుర్తి తదితర గ్రామాల్లో రంజాన్ పండుగను వైభవంగా నిర్వహించారు.

గూడూరు: గూడూరులో ముస్లింలు రంజాన్ పండగను జరుపుకున్నారు. టీడీపీ నాయకులు నగర పంచాయతీ మాజీ వైస్ చైర్మన్ కురుకుంద రామాంజనేయులు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గజేంద్ర గోపాల్ నాయుడు, మైనార్టీ నాయకులు మన్సూర్ బాష, ఇబ్రహీం, మునగాల కృష్ణ తదితరులు రంజాన్ వేడుకల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

రంజాన్ వేడుకల్లో టీజీ భరత్

కర్నూలు అర్బన్: కర్నూలు నియోజకవర్గం ప్రజలు ఎదుర్కొంటున్న నీటి కష్టాలు తీర్చాలని అల్లాను ప్రార్థించినట్లు కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ తెలిపారు. నగరంలోని పాత ఈద్గాలో ఆయన ఈద్ ఉల్ ఫితర్ సందర్భంగా ముస్లింలతో కలిసి ప్రార్థనల్లో పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఔదార్యం



ఆర్థిక సాయం చేస్తున్న పూర్వ విద్యార్థి సంఘం నాయకులు

కర్నూలు(ఎడ్యుకేషన్), ఏప్రిల్ 11: ఆపదలో ఉన్న మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందించి యాదవ్ హాస్టల్ పూర్వ విద్యార్థులు అండగా నిలిచారు. తెలంగాణ రాష్ట్రం అలంపూర్ మండలం హిమాంపురం గ్రామానికి చెందిన కురువ ప్రతాప్ 15 ఏళ్ల క్రితం కర్నూలు జిల్లా కేంద్రంలోని యాదవ విద్యార్థి వసతి గృహంలో ఉంటూ ఎస్టీబీసీ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశాడు. అతడు ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కర్నూలు యాదవ హాస్టల్ పూర్వ విద్యార్థులు ఓబయ్య, వార్డెన్ రామకృష్ణ, ఎస్‌ఐ నరసింహ, జైలర్ రామక్రిష్ణ, పాండురంగ తదితరులు రూ.86వేలు సేకరించి ప్రతాప్ కూతరు సాయివర్షిణి పేరుతో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. డిపాజిట్ బాండును గురువారం ఆయన భార్య సాయమ్మకు అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఈదన్న, చంద్రుడు, తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలతో పేదలకు వెలుగు

గూడూరు, ఏప్రిల్ 10: టీడీపీ అధినేత చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగు నింపుతుందని కోడుమూరు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొగ్గుల దస్తగిరి అన్నారు. బుధవారం గూడూరు మండలంలోని బూడిదపాడు గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అలాగే జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బంగారు శ్రీను, రాముడు, వీరన్న పాల్గొన్నారు.

సైకో పోవాలి సైకిల్ రావాలి

సి. బెళగల్, ఏప్రిల్ 11: సైకో పోవాలి సైకిల్ రావాలని మండలంలోని రంగాపురం గ్రామంలో గురువారం టీడీపీ నాయకుడు శంకర్ బాబురెడ్డి అన్నారు. గురువారం బీసీ కాలనీలో బాబుష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆనంద్, మహేశ్, రాజు రాముడు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు పలువురి పరామర్శ

కర్నూలు(హాస్పిటల్), ఏప్రిల్ 8: కల్లూరు మండలం చిన్నటేకూరు చిన్నారులను పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరు చరిత, నంద్యాల పార్లమెంటు టీడీపీ అభ్యర్థి బైరెడ్డి శబరి, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి పరామర్శించారు. చిన్నారులకు మెరుగైన వైద్యం అందించాలని ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డా.సి.ప్రభాకర్ రెడ్డి, పీడీయాట్రిక్ విభాగాధిపతి డా.విజయానందబాబును కోరారు. చిన్నారులకు ఎలాంటి ప్రాణాపాయం లేదని ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డా.సి.ప్రభాకర్ రెడ్డి తెలిపారు. సత్వర వైద్యం అందిస్తున్నామన్నారు.

సెలవు రోజు ప్రత్యేక కౌంటరు

కర్నూలు(న్యూ సిటీ), ఏప్రిల్ 11: నగర పాలక సంస్థ కార్యాలయంలో పన్ను వసూలు చేసేందుకు సెలవు రోజు ప్రత్యేక కౌంటరు ఏర్పాటు చేశారు. గురువారం కౌంటరును మేనేజర్ తనిఖీ చేశారు. పన్ను చెల్లింపుదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

దీనజన బాంధవుడు జ్యోతిరావు పూలే

- ఘనంగా జయంతి వేడుకలు
- ఆయన సేవలను కొనియాడిన వక్తలు





పూలే విగ్రహానికి నివాళి అర్పిస్తున్న టీడీపీ నాయకులు, శరీన్‌నగర్‌లో నివాళి అర్పిస్తున్న వీహెచ్‌పీ నాయకులు

కర్నూలు(న్యూసిటీ), ఏప్రిల్ 11: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతి రావు పూలే అని జిల్లా పరిషత్ సీఈఓ జి.నాసరరెడ్డి అన్నారు. పూలే 198వ జయంతి సందర్భంగా గురువారం జిల్లా పరిషత్ మినీ సమావేశ భవనంలో ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి వాళులర్పించారు. ఈ సందర్భంగా జి.నాసరరెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఆత్మస్థైర్యం కల్పించి వారి సాధికారత కోసం కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో పరిపాలన అధికారులు సి.రాం గోపాల్, సరస్వతి, సీఈఓ సీసీ భరత్‌రెడ్డి పాల్గొన్నారు.

- ఏపీ రజక వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సి.గురుశేఖర్, నగర అధ్యక్షురాలు జయమ్మ కేకే భవన్ ఆవరణలోని ఐలమ్మ కార్యాలయంలో పూలు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకుని కర్నూలు జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్సు అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బైరాపురం రాజు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు సోమసుందరం, మీసాల బాబు, సురేంద్ర పాల్గొన్నారు.
- మహాత్మాజ్యోతిరావు పూలే జయంతి వేడుకలను వైసీపీ జిల్లా పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కర్నూలు వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఏఎండీ ఇంతియాజ్, జిల్లా అధ్యక్షురాలు సత్యనారాయణమ్మ పూలే చిత్రపటానికి నివాళులర్పించారు.

పూలే ఆశయాలను కొనసాగిద్దాం

కర్నూలు ఎడ్యుకేషన్: మహాత్మా జ్యోతిరావు పూలే అందరికీ ఆదర్శమని పలువురు వక్తలు కొనియాడారు. పూలే విగ్రహానికి రాజకీయ, కుల ప్రజా సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గట్టు తిమ్మప్ప, రత్నం ఏసేపు, రాయలసీమ విద్యావంతుల వేదిక నాయకులు రవిప్రకాష్, మద్దయ్య, మనోహర్, సుబ్బరాయుడు తదితరులు నివాళులర్పించారు.

కర్నూలు కల్చరల్: అసమానతలను తొలగించి సమసమాజ నిర్మాణంలో యువత ముందుకు పోవాలని వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి మాళిగి భానుప్రకాశ్ పిలుపునిచ్చారు. గురువారం నగరంలోని హరిశ్చంద్ర శరీన్ నగర్‌లోని జ్యోతిబా పూలే విగ్రహానికి పుష్పమాలలు సమర్పించి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బజరంగ్ దళ్ రాష్ట్ర కన్వీనర్ ప్రతాపరెడ్డి, వీహెచ్‌పీ జిల్లా సహ కార్యదర్శి గోవిందరాజులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయంలో..

కర్నూలు అర్బన్ : బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అహర్నిశలు పాటుపడిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని టీడీపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ బీటీ నాయుడు అన్నారు. గురువారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి వై. నాగేశ్వరరావు యాదవ్, రజక సంఘం నాయకులు రాంబాబు, తిరుపాలుబాబుతో కలిసి మహాత్మజ్యోతి రావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పి.హనుమంతరావు చౌదరి, కుంపటి కృష్ణ, రామక్రిష్టుడు, సీపీ వెంకటేష్, గణేష్, తదిరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో..

కర్నూలు అర్బన్ : బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే అని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బాబు రావు అన్నారు. గురువారం నగరంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యలయంలో మహాత్మా జ్యోతి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి రాంపుల్లయ్య యాదవ్, కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి మురళీ కృష్ణ, మాజీ మంత్రి మూలింటి మారెప్ప పాల్గొన్నారు.

కల్లూరు: బడుగు గలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావు పూలే అని పాణ్యం టీడీపీ అభ్యర్థి మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జ్ గౌరు వెంకటరెడ్డి అన్నారు. గురువారం తమ స్వగృహంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు దేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, పుసులూరు ప్రభాకర్ రెడ్డి వాకిటి మాదేష్, కాసాని హహేష్‌గౌడ్, గోవిందరెడ్డి, మోహన్‌రెడ్డి, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, విశ్వేశ్వరరెడ్డి, పాలకొలను సుదాకర్‌రెడ్డి, ధనుంజయ పాల్గొన్నారు.

ఐదేళ్లలో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తా: టీజీ

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 11: ఆరు గ్యారంటీలను ఐదేళ్లలో అమలు చేసి కర్నూలు ప్రజల కష్టాలన్నింటినీ తీరుస్తానని కర్నూలు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ అభ్యర్థి టీజీ భరత్ అన్నారు. గురువారం నగరంలో సీతారం నగర్‌లో టీజీ భరత్ భరోసా యాత్ర కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజలు పలు సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. పారిశుధ్యం పనులు చేసేందుకు ఎవరూ రావడం లేదన్నారు. అర్హులైన వారికి పింఛన్లు మంజూరు చేయలేదని చెప్పారు. ఇంటింటికి దీంతో టీజీ భరత్ స్పందిస్తూ కర్నూలు నియోజకవర్గ ప్రజల సమస్యలు పరిష్కరించి నగరాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు 6 గ్యారంటీలతో మేనిఫెస్టో రూపొందించినట్లు చెప్పారు. తాము అధికారంలోకి రాగానే సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి హరిబాబు, మనోజ్, ప్రభాకర్, చంద్రశేఖర్, కృష్ణవేణి, లక్ష్మి జ్యోతి, సురేంద్రరెడ్డి, లోకేష్, యేసు, రాజశేఖరరెడ్డి, ఈశ్వరయ్య, సురేష్, నరేష్ ఈరన్న, జనసేన నాయకులు పవన్, బూత్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.



మహిళతో మాట్లాడుతున్న టీజీ భరత్

వైసీపీకి భారీ షాక్



గౌరు దంపతుల సమక్షంలో టీడీపీలో చేరిన లొద్దిపల్లె, ఉయ్యాలవాడ, ఓర్వకల్లు వైసీపీ నాయకులు

కల్లూరు, ఏప్రిల్ 11: పాణ్యం నియోజకవర్గంలోని ఓర్వకల్లు మండలంలో అధికార పార్టీ వైసీపీకి షాక్ తగిలింది. ఓర్వకల్లు, లొద్దిపల్లె, ఉయ్యాలవాడ గ్రామాల్లోని వైసీపీ నాయకులు తెలుగుదేశం పార్టీలో చేరారు. గురువారం లొద్దిపల్లెకు చెందిన మాజీ సర్పంచు వైసీపీ నాయకుడు పుల్లారెడ్డితోపాటు 80 కుటుంబాలు పాణ్యం టీడీపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జ్ గౌరు వెంకటరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరాయి. పార్టీలో చేరిన వారిలో భక్తలోకేష్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, సుదాకర్‌రెడ్డి, శ్రీనివాసులు, నారాయణరెడ్డి, మధు, సుబ్రహ్మణ్యంరెడ్డి, భరత్‌కుమార్‌రెడ్డి, కృష్ణ, పవన్, లక్ష్మన్న ఉన్నారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

- ఓర్వకల్లు మండల కేంద్రలోని 15 కుటుంబాలు గౌరు దంపతుల సమక్షంలో గురువారం టీడీపీలో చేరాయి టీడీపీ కండువాలు వేసి వారిని గౌరు పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.
- ఉయ్యాలవాడలో 80 కుటుంబాలు గౌరు చరిత, గౌరు వెంకటరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. గురువారం ఉయ్యాలవాడకు చెందిన మద్దిరెడ్డి మణిమోహన్‌రెడ్డి, బొట్టు సుధాకర్, వలిబేగ్, మహ్మద్‌షరీఫ్, షాషావలి, మహమ్మద్‌తయార్, నిసార్‌బేగ్, ఖాజావలిబేగ్‌తోపాటు 80 కుటుంబాలు టీడీపీలో చేరాయి.
- తెలుగుదేశం పార్టీతోనే మాదిగల సంక్షేమం సాధ్యమని పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరు చరిత, నంద్యాల పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ బైరెడ్డి శబరి స్పష్టం చేశారు. గురువారం కల్లూరు మండలం దూపాడు సమీపంలోని లక్ష్మీవెంకటేశ్వర ఫంక్షన్ హాల్లో నిర్వహించిన మాదిగల ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పెరుగు పురుషోత్తంరెడ్డి, ప్రభాకర్ యాదవ్, ఎమ్మార్పీఎస్ నాయకులు కాశపోగు సూరి మాదిగ, రాచపూడి ఆనంద్, రెడ్డిపోగు విజయ్, ఆశపోగు పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వసంతోత్సవం

కోడుమూరు (రూరల్), ఏప్రిల్ 11: మండలంలోని వెంకటగిరిలో ఉగాది వేడుకలలో భాగంగా వసంతోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులను పల్లకిలో కొలువుంచి స్థానిక దస్తగిరయ్యస్వామి దర్గా వరకు వెళ్లి తిరిగి చేర్చారు. పల్లకి ముందు ఎద్దుల బండిపై డ్రమ్ములలో రంగు నీళ్లు నింపి ఉంచారు. రంగు నీళ్లు చల్లుకుంటూ యువకులు, పెద్దలు వసంతోత్సవం సంతోషాలతో జరిపారు. గిడ్డాంజనేయస్వామి ఉగాది వేడుకల్లో భాగంగా గురువారం సాయంత్రం పోటీలు నిర్వహించారు. యువకుల పరుగు పందెంలో సునిల్, గిరి మొదటి రెండు స్థానాలలో నిలిచారు. బాలికల పరుగు పందెంలో శ్రావణి, శ్రీవణ్య విజేతలుగా నిలిచారు. మహిళలకు కబడ్డీ పోటీ నిర్వహించి బహుమతులు అందజేశారు.

'భారత జీవన విధానమే రామాయణం'

కర్నూలు(కల్చరల్), ఏప్రిల్ 11: రామాయణ మహాకావ్యంతో భారతీయ జీవన విధానం ముడిపడి ఉందని, ధర్మబద్ధమైన మూర్తిమత్వానికి శ్రీరామచంద్రుడే ఏకైక సాక్షాత్కారమని విశ్రాంత తెలుగు పండితురాలు గరుడాద్రి వనజ కుమారి అన్నారు. టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లా శాఖ ఆధ్వర్యంలో పాత నగరంలోని రాంభొట్ల దేవస్థానంలో ఏర్పాటు చేసిన 'శ్రీమద్రామాయణ ప్రవచన సప్తాహ' కార్యక్రమంలో భాగంగా రెండో రోజు గురువారం 'శ్రీరాముడు - ధర్మస్వరూపుడు' అనే అంశంపై ఆమె భక్తులకు ప్రవచన బోధన చేశారు. కార్యక్రమంలో హిందూ ధర్మ ప్రచార పరిషత్ కార్యనిర్వాహకుడు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి, దేవస్థానం చైర్ పర్సన్ నగరూరు దీప్తి, కార్పొరేటర్ నగరూరు శ్రీనివాసులు, అర్చకులు గిరీశ్ శర్మ, మహాలక్ష్మి, కృష్ణకాంత్ పాల్గొన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రం ప్రారంభం

కర్నూలు(కల్చరల్), ఏప్రిల్ 11: నగరంలోని నాగిరెడ్డి రెవెన్యూ కాలనీలోగల విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) కార్యాలయంలో గురువారం ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని మహాదాత దివంగత జి. పుల్లారెడ్డి తనయుడు, జి. పుల్లారెడ్డి స్వీట్స్ అధినేత ఏకాంబరరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో మూడు ప్రాంతాల క్షేత్ర సంఘటన మంత్రి గుమ్మళ్ల సత్యం, వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు సాయిరెడ్డి, వీహెచ్‌పీ రాష్ట్ర కార్యదర్శి కాకర్ల రాముడు పాల్గొన్నారు.

ఘనంగా రంజాన్

జిల్లా వ్యాప్తంగా ముస్లింలు రంజాన్ వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. బుధవారం రాత్రి నెలవంక కనిపించడంతో ఉపవాసాలు ముగించారు. ప్రార్థనలు, దానధర్మాలతో నెలరోజులపాటు నియమనిష్ఠలతో గడిపిన ముస్లింలు గురువారం రంజాన్ వేడుకలను ఆనందంగా జరుపుకున్నారు. స్థానికంగా ఉండే ఈద్గాలకు వెళ్లి ప్రార్థనలు చేశారు. చిన్నాపెద్దలు ఒకరికొకరు అలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. జిల్లా వ్యాప్తంగా పలువురు ప్రముఖులు ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ఆదోనిలోని పురాతన జామియా మసీదు, షాహిమాం దర్గా, చంద్‌షాదర్గాలలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఎమ్మిగనూరు ఎస్‌బీఐ బ్యాంకు సమీపంలోని ఈద్గాలో మతగురువు సయ్యద్ షా మహ్మద్ పీర్ ఖాద్రీ ఆధ్వర్యంలో ఈద్ ఉల్ ఫితర్ నమాజ్‌ను వేలమంది ముస్లిం నిర్వహించారు. ఆలూరు పట్టణంతో పాటు హత్తిబెళగల్, మొలగవల్లి, హులేబీడు, అరికేర, కురువల్లి, కమ్మరచేడు గ్రామాల్లోని ఈద్గాలో ముస్లిములు ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. చిప్పగిరిలోని ప్రసిద్ధ దరా సత్తార్వలి, భంభం సాహెబ్ దర్గాలలో సలాములు చదివి శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)



ఎమ్మిగనూరు ఈద్గా మైదానంలో ప్రత్యేకప్రార్థనలు





ఆదోని జామియా మసీదులో... శుభాకాంక్షలు తెలుపుకుంటున్న చిన్నారులు







ఆదోని మసీదులో ప్రార్థన, శుభాకాంక్షలు తెలుపుకుంటున్న దృశ్యం, ఎమ్మిగనూరు ఈద్గాలో ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి

గంధపు చక్కపై జామియా మసీదు సూక్ష్మ చిత్రం



గంధపు చెక్కపై చిత్రీకరించిన జామీయ మసీదు సూక్ష్మచిత్రం

ఆదోని, ఏప్రిల్ 11: నారాయణపురం గ్రామానికి చెందిన మల్లికార్జున రంజాన్ పండగను పురస్కరించుకొని జామియా మసీదు సూక్ష్మ చిత్రాన్ని గంధపు చెక్కపై పెయింటింగ్ వేశారు. ఆదోనిలోని 350 సంవత్సరాల క్రితం నిర్మించిన జామియా మసీదు సూక్ష్మచిత్రాన్ని దాదాపు గంటసేపు కష్టపడి గంధపు చెక్కపై పెయింట్‌తో వేసి అందర్నీ అబ్బురపరిచాడు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘన



వైసీపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న పోస్టుమాస్టర్

మద్దికెర, ఏప్రిల్ 11: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లో పని చేస్తున్న ఉద్యోగులు ఎన్నికల ప్రచారాల్లో పాల్గొనకూడదని ఆదేశాలు ఉన్నప్పటికీ మద్దికెరలో వైసీపీ కార్యకర్తల సమావేశంలో సబ్ పోస్టు మాస్టర్ పి. లక్ష్మీకాంతరెడ్డి పాల్గొని ప్రసంగించి ఎన్నికల కోడ్ ఉల్లంఘించారు. గురువారం స్థానిక డీపీఏపీ కమ్యూనిటీ హాలులో వైసీపీ మండల నాయకులు, కార్యకర్తల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కె.శ్రీదేవి పాల్గొన్నారు. అయితే.. హంప గ్రామంలో 30 సంవత్సరాలకు పైగా తాత్కాలిక పోస్టుమాస్టర్‌గా పని చేస్తున్న పి.లక్ష్మీకాంతరెడ్డి ఈ ఎన్నికల సమావేశంలో పాల్గొనడమే కాకుండా వైసీపీని గెలిపించాలని ప్రసంగించడం విశేషం. గ్రామంలో కూడా ప్రచారం చేస్తున్నారని గ్రామస్థులు తెలిపారు. ఈ మేరకు ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేసినట్లు టీడీపీ నాయకులు తెలిపారు.

వైసీపీ ప్రభుత్వం ప్రజలను నట్టేట ముంచింది

మద్దికెర, ఏప్రిల్ 11: ఐదేళ్ల పాటు అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం ప్రజలను నట్టేట ముంచిందని రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి పి. రామచంద్రయ్య అన్నారు. గురువారం మండలంలోని బురుజుల గ్రామంలో సీపీఐ ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల జగన్ రెడ్డి పాలనలో ఒక్క ప్రాజెక్టు పూర్తి చేయలేదన్నారు. ఏటా డీఎస్సీ విడుదల చేస్తానని, జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని దగా చేశారన్నారు. నూతన ఇసుక పాలసీలో రాష్ట్రంలో ఇసుక కొరత సృష్టించి భవన నిర్మాణ కార్మిక రంగాన్ని నట్టేట ముంచి ఇసుక మాఫియాను ఏర్పాటు చేసి జగన్ రెడ్డి వందల కోట్లు దోచుకున్నారన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీని ఇంటికి పంపాలని కోరారు. మండల సీపీఐ కార్యదర్శి నాగరాజు, సీపీఐ నాయకులు శీనప్ప, మాణిక్యమ్మ, రాజాసాబ్, ఈరన్న, కారన్న తదితరులు పాల్గొన్నారు

గుండెపోటుతో వీఆర్వో మృతి

కోసిగి, ఏప్రిల్ 11: అగసనూరు గ్రామ వీఆర్వో ఎస్.రాఘవేంద్ర గుండెపోటుతో మృతి చెందాడు. వీఆర్వో భార్య సరస్వతి తెలిపిన వివరాల మేరకు రాఘవేంద్ర సచివాలయం వీఆర్వోగా పని చేస్తున్నారు. జంపాపురంలో సాయంత్రం 6 గంటల సమయంలో ఇంట్లో గుండెపోటుకు గురయ్యాడు. మెరుగైన వైద్యం కోసం ఆదోనికి తరలిస్తుండగా.. మార్గమధ్యలో మృతి చెందాడు. మృతునికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. వీఆర్వో రాఘవేంద్ర మృతి పై తహసీల్దార్ పి.మురళి, ఆర్ఐ శ్రీరామ్, తిక్కస్వామి, వీఆర్వోల సంఘం నాయకులు బసవరాజు, రామాంజనేయులు సంతాపం తెలిపారు.

జింక పిల్ల అప్పగింత

మద్దికెర, ఏప్రిల్ 11: మద్దికెర గ్రామానికి చెందిన రాజుకు చెందిన వ్యవసాయ పొలాల్లో దొరికిన జింక పిల్లను ఏఎస్ఐ చెన్నయ్యకు గురువారం అప్పగించారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా నల్లరేగడి పొలాలు ఉండడంతో జింకలు ఎక్కువగా సంచరిస్తుంటాయి. వేసవి కాలం కావడంతో వ్యవసాయ పొలాల్లో నీరు లేక గ్రామ శివారులో నీరు తాగేందుకు వస్తుంటాయి. అలా వచ్చిన జింకను కుక్కలు తరుముతుండగా.. జింక పిల్లను కుక్కల బారి నుంచి కాపాడి పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. పోలీసులు జింక పిల్లను ఫారెస్టు అధికారులకు అప్పగించారు.

జగన్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలి

మద్దికెర, ఏప్రిల్ 11: బీసీలంతా ఏకమై.. జగన్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని మాజీ జడ్పీటీసీ సభ్యులు పి. పురుషోత్తం చౌదరి, జమేదార్ రాజన్న యాదవ్, రాజేశ్వర చౌదరి, తాలుకా టీడీపీ నాయకులు నరసింహులు చౌదరి, రామనాయుడు అన్నారు. గురువారం మండలంలోని పెరవలి గ్రామంలో మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి పెరవలి రామాంజులు ఆధ్వర్యంలో జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ అవినీతి అరాచక ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబుతోనే బీసీల సంక్షేమం సాధ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు వెంకటవర్మ, మాజీ ఎంపీటీసీ పులిశేఖర్, టీడీపీ నాయకులు మూలింటి రంగస్వామి, బారిక అంజనేయ, చంద్రశేఖర్‌గౌడు, గడ్డం రామాంజులు పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నాయకుడు సత్యారెడ్డి మృతి



సత్యారెడ్డి,(ఫైల్)

నందవరం, ఏప్రిల్ 11: టీడీపీ సీనియర్ నాయకుడు, గురుజాల మాజీ ట్రస్టు బోర్డు చైర్మన్ సత్యారెడ్డి గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. టీడీపీకి ఎంతో సేవ చేశారని, ఆయన మృతి పార్టీకి తీరని లోటని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బీవి జయ నాగేశ్వరరెడ్డి అన్నారు. వారి కుటుంబాని పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందన్నారు. టీడీపీ నాయకులు శివారెడ్డి, కాశీంవలీ, రైస్‌మిల్ నారాయణరెడ్డి, దర్మాపురం గోపాల్, రాయచోటి రామకృష్ణరెడ్డి ఉన్నారు.

ఘనంగా జ్యోతిరావు పూలే జయంతి



పూలే ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో పేదమహిళలకు దుస్తులు పంపిణీ చేస్తున్న సీఐ మోహన్ రెడ్డి

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 11: దేశంలో సామాజిక మార్పు కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. గురువారం ఎమ్మిగనూరులో స్థానిక టీడీపీ కార్యాలయంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. జ్యోతిరావు పూలే ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ మోహన్ రెడ్డి, బీసీ సంఘం నాయకులు నక్కల మిట్ట శ్రీనివాసులు, మల్లెల గ్రూప్ అధినేత మల్లేల ఆల్‌ఫ్రెడ్ రాజు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం వివిధ గ్రామాలకు చెందిన300మంది పేద మహిళలకు దుస్తులను సీఐ చేతుల మీదుగా పంపిణీ చేశారు. సొసైటీ నిర్వాహకులు సింగేటి నరసన్న, కుమ్మరి నాగరాజు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పూలే ఆశయ సాధనకు కృషి చేస్తాం

ఆదోని టౌన్ : సంఘసంస్కర్త జ్యోతిరావు పూలే గారి ఆశయ సాధన కోసం బీజేపీ నిరంతరం కృషి చేస్తూనే ఉంటుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మలేకర్ శ్రీనివాసులు, ఆదోని అసెంబ్లీ కో-కన్వీనర్ నాగరాజు గౌడ్ అన్నారు. గురువారం పూలే జయంతి సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయంలో నగర అధ్యక్షుడు సాయికుమార్ ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అలాగే బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బోయ నీలకంఠప్ప, ప్రధాన కార్యదర్శి ఎండీ బసవరాజు స్వామి, పూలే జయంతి నిర్వహించారు. బీసీ నాయకులు సాయినాథ్, పాల్గొన్నారు.

గోనెగండ్ల/పత్తికొండ/ఆదోని అర్బన్: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే అందరికి ఆదర్శమని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కరుణాకర్ అన్నారు. గురువారం పూలే జయంతి నిర్వహించి ఘన నివాళి అర్పించారు. పత్తికొండలో పత్తికొండ బీజేపీ కార్యాలయంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సీసీ రంగన్న, గోవర్దన్ నాయుడు ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆదోనిలోని ఎస్టీయూ ప్రాంతీయ కార్యాలయంలో బల్లేకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యన్న, రాష్ట్ర కౌన్సిలర్ మహాదేవప్ప అదనపు ప్రధాన కార్యదర్శి సుంకన్న పూలేకు ఘన నివాళి అర్పించారు.

టీడీపీతోనే రాష్ట్రానికి మంచి రోజులు

- టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బస్తిపాటి నాగరాజు, రాఘవేంద్రరెడ్డి
- వైసీపీ నుంచి 108 కుటుంబాలు టీడీపీలో చేరిక
- కౌతాళం మండలంలో విస్తృత ప్రచారం



టీడీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు నాగరాజు, రాఘవేంద్రరెడ్డి



కౌతాళంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న అభ్యర్థులు

మంత్రాలయం, ఏప్రిల్ 11 : ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం భష్టు పట్టిందని, తెలుగుదేశం పార్టీ వస్తేనే రాష్ట్రానికి మంచి రోజులు వస్తాయని టీడీపీ ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని కోసిగి మండలం వందగల్లు, ఐరంగల్, కోల్‌మాన్‌పేట, రచ్చుమర్రి, నూగూరు గ్రామాలకు చెందిన వైసీపీ కుటుంబాలు రఘునాథరెడ్డి, రామక్రిష్ణారెడ్డి, రాకేష్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి రాఘవేంద్రరెడ్డి, బస్తిపాడు నాగరాజు పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో రామాంజి, వైస్ సర్పంచు పార్వతి, వీరారెడ్డి, ఎంపీటీసీ సోదరుడు మాధవరెడ్డి, నగేష్, రమేష్, ఈరన్న, హనుమన్న, మజ్జిగ శ్రీరాములు, డీలర్ చిన్న వీరేష్, తలారి శ్రీరాములు, నర్సయ్య, హుశేని, సురేష్, వెంకటేశ్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో నూగూరు నగేష్ నాయుడు, పల్లెపాడు ముత్తురెడ్డి, రామిరెడ్డి, జ్ఞానేష్, మాజీ జడ్పీటీసీ రామక్రిష్ణ, మాలపల్లి లక్ష్మయ్య, డా.నరసింహులు తదితరులు పాల్గొన్నారు.


విస్తృతంగా ఎన్నికల ప్రచారం

కౌతాళం : మండల పరిధిలోని మేళిగనూరు, నదిచాగి, కుంబళనూరు, కుంబళనూరు క్యాంపు, గుడికంబాలి, మరళి గ్రామాల్లో ఎన్డీయే కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు రాఘవేంద్రరెడ్డి, బస్తిపాటి నాగరాజు విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలను గురించి వివరిస్తూ టీడీపీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఉలిగయ్య, నాయకులు గుడిసె క్రిష్టమ్మ, సురేష్‌నాయుడు, సతీష్ నాయుడు, జనసేనా నాయకులు, బీజేపీ నాయకులు, టీడీపీ నాయకులు నీలకంఠరెడ్డి, కురువ వీరేష్, కృష్ణకాంత్, శ్రీరాములు ఉన్నారు.

కోసిగి : టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి సోదరుడు ఎం.రామకృష్ణారెడ్డి, కర్నూలు పార్లమెంటు టీడీపీ ఉపాధ్యక్షుడు ముత్తురెడ్డి, పల్లెపాడు రామిరెడి మండలంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి టీడీపీ కార్యక్రమంలో భాగంగా కడిదొడ్డి, కందుకూరు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి టీడీపీకి ఓటు వేయాలని కోరారు.

టీడీపీలోనే బీసీలకు పెద్దపీట : బీవీ

- టీడీపీలో చేరిన గోనేగండ్ల రజక సామాజిక వర్గం నాయకులు




బీవీ సమక్షంలో టీడీపీలో చేరిన రజక సామాజిక వర్గీయులు

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 11: తెలుగుదేశం పార్టీ మాత్రమే బీసీలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యత ఇచ్చి పెద్దపీట వేస్తుందని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ అభ్యర్థి బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. గురువారం మండలకేంద్రంలో రజక సామాజిక వర్గానికి చెందిన కుటుంబాలు బీవీ సమక్షంలో టీడీపీలో చేరారు. వీరికి పార్టీకండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీవీ మాట్లాడుతూ వైసీపీకి ఎన్నికలప్పుడే బీసీలు గుర్తుకు వస్తున్నారని విమర్శించారు. పదుల సంఖ్యలో కార్పొరేషన్లు ఏర్పాటు చేసినా ఒక్కరికి ఒక్క రూపాయ రుణం ఇచ్చిన పాపాన పోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గోనేగండ్ల మండల నాయకులు నజీర్, ఎస్వీ రామాంజనేయులు, బేతాల్ బడేసాబ్, సీనియర్ నాయకులు పూజారి చంద్రశేఖర్, పోలకల్ వెంకటేశులు, తెలుగుయువత నాయకులు రంగస్వామి నాయుడు, చంద్రయ్య పాల్గొన్నారు.

అవకాశం ఇస్తే అభివృద్ధి చేస్తా : వీరభద్రగౌడ్

- బాపురం సర్పంచుతోపాటు 80 కుటుంబాలు టీడీపీలో చేరిక



వీరభద్రగౌడ్ సమక్షంలో టీడీపీలో చేరిన బాపురం వైసీపీ సర్పంచు, నాయకులు

హాలహర్వి, ఏప్రిల్ 11: సార్వత్రిక ఎన్నికల్లో తనను గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపుతానని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వీరభద్రగౌడ్ అన్నారు. గురువారం పచ్చరపల్లి, బాపురం, జే హోసళ్లి, అమృతాపురం, బల్లూరు, సిద్ధాపురం గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పచ్చరపల్లిలో టీడీపీ యువనేత ప్రహల్లాద రెడ్డి ఆధ్వర్యంలో జనసేన తాలూకా ఇన్‌చార్జి వెంకప్పతో కలిసి విస్తృతంగా ప్రచారం నిర్వహించారు చంద్రబాబు ప్రవేశ పెట్టబోయే సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. ఆలూరు ప్రాంతం సస్యశ్యామలం కావలంటే టీడీపీతోనే సాధ్యమని స్పష్టం చేశారు. మండల కన్వీనర్, సుధాకర్, హనుమంతరెడ్డి, మారుతి, శ్రీధర్, ఉమాకాంత్ స్వామి, సోమశేఖరయ్య పాల్గొన్నారు.

వైసీపీ నుంచి 80 కుటుంబాలు చేరిక

బాపురం గ్రామంలో వీరభద్రగౌడ్ సమక్షంలో వైసీపీ గ్రామ సర్పంచు భాగ్యలక్ష్మీతో పాటు భర్త నాగేంద్ర 80 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబును సీఎం చేయాలన్న సంకల్పంతో పార్టీలో చేరామని స్పష్టం చేశారు.

లారీ ఢీకొని నేలకూలిన విద్యుత్ స్తంభాలు

గోనెగండ్ల, ఏప్రిల్ 11: ఐరన్‌బండ గ్రామ శివారులో గురువారం ఉదయం ఉల్లిగడ్డల లారీ విద్యుత్ స్తంభాలను ఢీకొనడంతో గ్రామానికి విద్యుత్ సరఫరా అయ్యే ఐదు విద్యుత్ స్తంభాలు, ఒక విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నెలకూలాయి. దీంతో ఐరన్‌బండ, ఎన్నెకండ్ల గ్రామాల్లో అంధకారం నెలకొంది. వేసవికాలం కావడంతో మధ్యాహ్నం ఫ్యాన్‌లు లేక, చల్లని నీరు లేక ప్రజలు ఇబ్బంది పడ్డారు. విద్యుత్ సిబ్బంది, ఏఈ సురేష్ గ్రామానికి చెరుకొని ప్రమాదానికి కారణమయిన ఉల్లిగడ్డల లారీ డ్రైవర్, యజమానిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు ఏఈ తెలిపారు. విద్యుత్ స్తంభాలు నెలకొరిగే సమయంలో అక్కడ జనం లేక పోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.



లారీ ఢీకొనడంతో నేలకూలిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

కోసిగి వైసీపీలో రగడ

- వైసీపీ ప్రచారంలో సొంత పార్టీ నాయకులే తిరుగుబాటు

కోసిగి, ఏప్రిల్ 11: వైసీపీ అధికారంలోకి రావడానికి కష్టపడ్డది మేము.. మాకు కావాల్సిన పనులు ఏమి చేశారని మళ్లీ ప్రచారానికి వచ్చారంటూ స్థానిక వైసీపీ నాయకులే ఆ పార్టీ నాయకులపై ఎదురు తిరిగిన సంఘటన గురువారం కోసిగిలోని 3వ వార్డులో చోటు చేసుకుంది. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వై.బాలనాగిరెడ్డి తరుపున వైసీపీ మండల ఇన్‌చార్జి మురళీధరరెడ్డి తదితరులు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. 3వ వార్డు వాల్మీకి నగర్‌లో ప్రచారం చేస్తున్న వైసీపీ నాయకుడు జగదీష్ స్వామికి ఆ కాలనికి చెందిన వైసీపీ ముఖ్య నాయకుని నుంచే తిరుగుబాటు ఎదురైంది. మాట మాట పెరిగి చేయి చేసుకునేంత వరకు వెళ్లింది. ఒకరినొకరు అసభ్యపదజాలాలతో తిట్టుకున్నారు. అక్కడున్నవారు పక్కకు తోసేశారు. ఏ ముఖం పెట్టుకొని ఓట్లడగడానికి వచ్చారంటూ నిలదీయడంతో ఆ పార్టీ నాయకులు గప్‌చుప్‌గా అక్కడి నుంచి జారుకున్నారు.

కర్ణాటక మద్యంపై ఉక్కుపాదం మోపండి

- సెబ్ అసిస్టెంట్ కమిషనర్ నేర విభాగం ఎం.సుధాకర్ రెడ్డి

కోసిగి, ఏప్రిల్ 11: సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని అక్రమ కర్ణాటక మద్యం తరలించే వారిపై ఉక్కుపాదం మోపి కేసులు నమోదు చేయాలని హెడ్ క్వార్టర్ సెబ్ అసిస్టెంట్ కమిషనర్ నేరవిభాగం ఎం.సుధాకర్ రెడ్డి అన్నారు. గురువారం కోసిగిలోని సెబ్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాన్ డ్యూటీపైడ్ మద్యం, నాటుసారా, బెల్టు షాపులపై విస్తృతంగా దాడులు చేసి కేసులు నమోదు చేయాలన్నారు. ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా విధులు చేయాలని ఆదేశించారు. కర్నూలు సెబ్ టాస్క్‌ఫోర్స్ సీఐ నర్సానాయుడు, ఎస్ఐ రమేష్‌బాబు సెబ్ సిబ్బంది ఉన్నారు.

రోడ్డెక్కిన ఉపాధి కూలీలు

- ఆరు రోజులు పనిచేస్తే.. మూడు రోజులే మస్టర్లలో నమోదు

ఆదోని రూరల్ ఏప్రిల్ 11 : సలసల మండే ఎండలో ఉపాధి కూలీలు రోడ్డెక్కి నిరసన వ్యక్తం చేశారు. ఉపాధి కూలి డబ్బు సక్రమంగా అందడం లేదని, పనులు కల్పించడంలో అధికారులు పూర్తిగా విఫలం చెందారని పాండవగల్లు ప్రధాన రహదారిలో ఉపాధి కూలీలు గురువారం బైఠాయించి నిరసన తెలిపారు. దాదాపు గంటపాటు కూలీలు రోడ్డుపై బైఠాయించడంతో వాహనాలు పెద్ద ఎత్తున నిలిచిపోయాయి. ఈ సందర్భంగా కూలీలు రామదాసు, వెంకటేష్, దేవయ్య ప్రసాద్, పెద్ద ఈరన్న మాట్లాడుతూ, గత ఏడాది అక్టోబర్‌లో పని చేసిన కూలీలకు కూలీలు అందలేదని, ఆరు రోజులు పనిచేస్తే మూడు రోజులు మాత్రమే పని చేసినట్లు మస్టర్లలో హాజరు వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు చొరవ తీసుకొని న్యాయం చేయాలని కోరారు.

నవరత్నాల రథంపై దర్శనమిచ్చిన ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, ఏప్రిల్ 11: రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు నవరత్నాల రథంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. రాఘవేంద్రస్వామి సజీవ సమాధి పొందిన గురువారం శుభ దినాన్ని పురస్కరించుకుని శ్రీ మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆధ్వర్యంలో బృందావనంకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండితుల మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల మధ్య నవరత్నాల రథంపై వజ్రాలు పొదిగిన ప్రహ్లాదరాయలను అధిష్ఠించి ఊరేగించారు.

భక్తుల సందడి : రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో మంత్రాలయంలో సందడిగా నెలకొంది. రంజాన్ సందర్భంగా సెలవు రావటంతో దక్షణాది రాష్ట్రాలైన ఆంధ్ర, తెలంగాణ, కర్నాటక, తమిళనాడు, మహారాష్ట్ర నుంచి వే లాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది.

రాఘవేంద్రుని సన్నిధిలో ఇద్దరు పీఠాధిపతులు : రాఘవేంద్ర స్వామి దర్శనార్థం కర్నాటకలోని శివమొగ్గ మఠం పీఠాధిపతి రామప్రియ తీర్థులు, వ్యాసరాజ మఠం పీఠాధిపతి విద్య విజయ తీర్థులు మంత్రాలయానికి వచ్చారు. వేదపండితుల మంత్రోచ్చారణాల మధ్య పూర్ణకుంభంతో మఠం అధికారులు ఘనంగా స్వాగతం పలికారు.

వైసీపీని గద్దెదించడమే లక్ష్యం



ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

తుగ్గలి, ఏప్రిల్ 11: వైసీపీ రాక్షస పాలన అంతం పలికి గద్దెదించడమే టీడీపీ లక్ష్యమని మాజీ రాష్ట్ర శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బత్తిన వెంకట్రాముడు అన్నారు. గురువారం మండలంలోని బొందిమడుగుల, నల్లగుండ్లలో శంఖారావం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరుగుతూ టీడీపీ పతకాలను వివరించారు. సాయంత్ర మారెల్లలో జయహో బీసీ సమావేశంలో వారు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల కోసం టీడీపీ హయాంలో అన్ని కులాల కార్పొరేషన్లు ఏర్పాటు చేసి రుణాలు అందించిన ఘనత చంద్రబాబుకు దక్కుతుందని గుర్తు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మనోహర్ చౌదరి, తిమ్మయ్యచౌదరి, వెంకటపతి, ప్రతాప్ యాదవ్, నల్లగుండ్ల రవి, జిన్నామాబు, మునేశ్వరగౌడు, తలారి రాముడ, తిరుపాల్ నాయుడు, శ్రీనివాసులు, చంద్రశేఖర్ యాదవ్, కొమ్మె వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

గన్‌తో బెదిరింపులకు పాల్పడ్డ నిందితులు అరెస్టు

- నిందితుల్లో మాజీ పోలీస్ అధికారి

పెద్దకడుబూరు, ఏప్రిల్ 11: హులికన్వి గ్రామంలో భూ వివాదంలో గన్‌తో బెదిరింపులకు పాల్పడిన ఓ రిటైర్డ్ పోలీసు అధికారితో పాటు మరో ఏడుగురి నిందితులను గురువారం పెద్దకడుబూరు పోలీసులు అరెస్టు చేశారు.మార్చి 31న పెద్దతుంబళం అప్పలయ్య గారి నాగరాజు, అప్పలయ్య గారి ఉరుకుందులను భూ వివాదంలో పంచాయతీ పేరుతో నిందితులు గన్‌తో బెదిరింపులకు పాల్పడ్డారు. ఈ సంఘటనను ఈ నెల 9న ఆంధ్రజ్యోతిలో "గన్ తో బెదిరింపులు" అన్న శీర్షికను వెలుగులోకి తెచ్చింది. ఇందుకు స్పందించిన పోలీసులు నిందితులను అరెస్టు చేశారు.